# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 28-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రపతి పదవిని గొప్ప బాధ్యతగా భావిస్తున్నట్లు ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- పరీక్షా పత్రాల లీకేజిని నియంత్రించడానికి ప్రభుత్వం సమగ్రమైన చట్టం తీసుకువస్తోందని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ లోక్ సభలో తెలిపారు.
- `యాంటీ-పేపర్ లీక్ బిల్లు`పై లోక్ సభలో ఈరోజు చర్చ సాగింది.
- పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి వంటి ఉన్నత రాజ్యాంగ పదవిని కేవలం గౌరవంగా కాకుండా గొప్ప బాధ్యతగా భావిస్తున్నట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము నాలుగేళ్ళ పదవీ కాలం పూర్తయిన సందర్భంగా రాష్ట్రపతి భవన్‌లో ఈరోజు జరిగిన ఒక ప్రత్యేక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ ఐదు స్మారక పుస్తకాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. దేశంలోని యువత నైతిక విలువలకు కట్టుబడి ఉంటూ.. సమాజ పురోగతికి కృషి చేయాలని గడిచిన నాలుగేళ్ల పదవీ కాలంలో ప్రోత్సహించానని గుర్తు చేసుకున్నారు. అదే విధంగా మహిళలు స్వయం సమృద్ధి సాధించి.. ఆత్మవిశ్వాసంతో ప్రగతి పథంలో ముందుకు సాగాలని కోరారు. గిరిజన వర్గాలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. వారు తమ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించుకుంటూనే, అభివృద్ధి ప్రధాన స్రవంతిలో భాగం కావాలని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

అనంతరం ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉన్నత పదవికి వన్నె తెచ్చారని కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = =

పరీక్షా పత్రాల లీకేజిని నియంత్రించడానికి ప్రభుత్వం సమగ్రమైన చట్టం తీసుకువస్తోందని కేంద్ర ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. విద్యార్థులు, యువత పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఈ బిల్లు నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. లోక్ సభలో ప్రశ్నా పత్రాల లీకేజీ నిరోధక బిల్లుపై చర్చ ప్రారంభించిన కేంద్రమంత్రి పరీక్షా పత్రాల లీకేజీ అన్నది వ్యవస్థాగత నేరంగా మారిందని చెప్పారు. వీటిని అరికట్టేందుకే చట్టంలో మార్పులు చేస్తున్నామని లోక్ సభకు వివరించారు. నిందితులను కఠినంగా శిక్షించేందుకు బిల్లులో నిబంధనలు రూపొందించామని చెప్పారు. దోషులకు శిక్షలను పదేళ్లకు పెంచామని, లీకేజీకి పాల్పడే ముఠాలకు జరిమానాను కోటి రూపాయల నుంచి 10 కోట్ల రూపాయలకు పెంచామని, కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశామని జితేంద్రసింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

పబ్లిక్ పరీక్షల ప్రశ్నా పత్రాల లీకేజీని నిరోధించే యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై లోక్ సభలో ఈ రోజు చర్చ సాగింది. ఈ చర్చ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంకా గాంధీ మాట్లాడుతూ.. ఢిల్లీలో విద్యార్థుల మీద ప్రభుత్వం పోలీసులతో దాడి చేయించడాన్ని తప్పు పట్టారు. పేపర్ లీకేజీ కారణంగా బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ... ప్రస్తుతం తీసుకొస్తున్న కొత్త బిల్లు పాత బిల్లుకు చిన్న సవరణ మాత్రమే అని అన్నారు. ఈ బిల్లుపై జరిగిన చర్చలో ఎన్సీపీ శరద్ పవార్ పార్టీకి చెందిన ఎంపీ సుప్రియా శూలే, తెలుగుదేశం పార్టీ లోక్ సభ నాయకుడు లావు శ్రీ కృష్ణ దేవరాయలు తదితరులు ప్రసంగించారు.

= = = = = = = = = = = = = = = = = = =

పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. వాటిని కప్పిపుచ్చుకోవడానికి, మభ్యపెట్టడానికి అక్కడ శాసన సభ ఎన్నికలు నిర్వహిస్తున్నారని అన్నారు. న్యూఢిల్లీలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ... జమ్మూ కాశ్మీర్, లడఖ్ భారతదేశంలో అంతర్భాగాలు అని స్పష్టం చేశారు. పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లో జరుగుతున్న సామూహిక నిరసనలు పాక్ ఆర్థిక దోపిడీ, ప్రజల ప్రాథమిక హక్కులను తిరస్కరించడం, పరిపాలనాపరమైన అణచివేతకు ప్రత్యక్ష నిదర్శనమని అన్నారు. దశాబ్దాలుగా భారత్‌పై సరిహద్దు ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ ప్రేరేపిస్తోందని రణధీర్ జైస్వాల్ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

నీట్ అంశంపై విద్యార్థుల నిరసన సందర్భంగా జరిగిన పోలీసుల దాడుల మీద ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేయడంతో రాజ్యసభ రేపటికి వాయిదా పడింది. రాజ్యసభ ఈరోజు సమావేశం కాగానే ఇదే అంశాన్ని ప్రతిపక్షాలు

లేవనెత్తాయి. దీంతో సభ గందరగోళం మధ్య మధ్యాహ్ననికి వాయిదా పడింది. సభ తిరిగి సమావేశమైనప్పుడు కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి జితన్ రామ్ మాంఝీ `సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి (సవరణ) బిల్లు-2026`ను ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ప్రవేశపెడుతున్న సమయంలో.. ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడం ప్రారంభించారు. దాంతో డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ సభను రేపటికి వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = =

అసోం రాష్ట్రంలో సంభవించిన వరద పరిస్థితులపైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు సమీక్ష నిర్వహించారు. అసోంకు చెందిన పార్లమెంటు సభ్యులతో ఈరోజు ఢిల్లీలో సమావేశమైన ప్రధానమంత్రి ఆ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న వరద పరిస్థితిపై వారితో చర్చించారు. వరద బాధితులకు సహాయం అందించే విషయంలో కేంద్ర ప్రభుత్వం అసోం ప్రభుత్వంతో కలిసి సమన్వయంతో పని చేస్తుందని నరేంద్ర మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (ఎన్డీఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్డీఆర్ఎఫ్) కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు 75 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులను విడుదల చేసింది. 2023-24 నుండి 2025-26 వరకు గల మూడేళ్ల కాలానికి సంబంధించి ఈ నిధులు విడుదల చేసినట్లుగా లోక్‌సభలో ఈరోజు లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ చెప్పారు. ఈ నిధులతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు `ఎస్డీఆర్ఎఫ్` ద్వారా సహాయక చర్యలు చేపడతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాల ప్రయత్నాలకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ.. అవసరమైన వనరులు, ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. తీవ్రమైన విపత్తులు సంభవించినప్పుడు.. `ఎన్డీఆర్ఎఫ్` నుండి అదనపు ఆర్థిక సహాయం కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని నిత్యానంద రాయ్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో `వికసిత్ భారత్ రోజ్‌గార్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్)` (వీబీ-జీ రామ్ జీ) కోసం 95 వేల, 692 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. లోక్‌సభలో ఈ రోజు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. బడ్జెట్ అంచనా దశలో చేసిన కేటాయింపుల్లో ఇదే అత్యధికమని తెలిపారు. వీబీ-జీ రామ్ జీ చట్టం-2025 ప్రకారం.. పని కోరుకునే ప్రతి గ్రామీణ కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో 125 రోజుల వేతన ఉపాధికి చట్టబద్ధమైన హామీ లభిస్తుందని చెప్పారు. ఇది గతంలోని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద ఉన్న 100 రోజులకు భిన్నమైనదని తెలిపారు. నీటి భద్రత, కీలక గ్రామీణ మౌలిక సదుపాయాలు, జీవనోపాధి, మౌలిక సదుపాయాలు వంటి  పనులను ఈ నిధులతో చేపడతామని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలో పర్యాటకాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో... కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యాన్ని తీసుకుంటోందని ఆ శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ తెలిపారు. లోక్‌సభలో ఈ రోజు  ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంగా దేశంలో ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను ఆకర్షించే విధంగా వివిధ ప్రచార కార్యక్రమాలను చేపడుతున్నట్లుగా కేంద్రమంత్రి చెప్పారు. టూరిజం రోడ్‌షోలు, ఫుడ్ ఫెస్టివల్స్, వాణిజ్య సమావేశాలు, ప్రవాస భారతీయులతో సంప్రదింపులు, టూర్ ఆపరేటర్లు, పరిశ్రమ భాగస్వాములు, మీడియాతో అవుట్ రీచ్ కార్యక్రమాలు వంటివి ఇందులో భాగంగా ఉంటాయని పేర్కొన్నారు. విదేశీయులను భారతదేశాన్ని సందర్శించేలా ప్రేరేపించడం ద్వారా ప్రవాస భారతీయులను ప్రోత్సహించి.. దేశాన్ని ఒక పర్యాటక గమ్యస్థానంగా చేయడానికి పర్యాటక మంత్రిత్వ శాఖ 2024లో `చలో ఇండియా క్యాంపెయిన్`ను ప్రారంభించిందని గజేంద్ర సింగ్ షెఖావత్ గుర్తు చేశారు.

===================

===================